దోమల నివారణకు చర్యలు : డిఎంహెచ్ఒ

భీమవరం : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దోమలు విజృంభణ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి గీతాబాయి, జిల్లా మలేరియా అధికారి వి.క్రాంతి కుమార్ అధ్యక్షతన ప్రపంచ దోమల దినోత్సవం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా డెంగీ వ్యాధుల అవగాహనకు సంబంధించిన గోడ పత్రిక, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే వ్యాధులను నివారణ, చికిత్స దోమలు వృద్ధిచెందే ఆవాసాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. డ్రై డే కార్యక్రమాలను సమర్థ వంతంగా నిర్వహించి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. డిఐఒ డి. సుధాలక్ష్మి, డిపిఎం పిఒ సిహెచ్.ధనలక్ష్మి, ఎఒ భావన, ఎఎంఒ వై.నాగబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది జిల్లా మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

కిక్కే.. కిక్కు..!

మందుబాబులకు రేయింబవళ్లు పండగే

రెండు జిల్లాల్లో 48 బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల

28న లాటరీ తీయనున్న కలెక్టర్లు

ఇప్పటికే ఏరులై పారుతున్న మద్యం

బార్ల ఏర్పాటుతో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలకు అనుమతి

మద్యం దుకాణాలు, బార్ల కేటాయింపులో గీతకార్మికులకు అన్యాయం

ప్రజాశక్తి - భీమవరం

రెండు జిల్లాల్లో వేళాపాళా లేకుండా ఏ సమయంలోనైనా మద్యం ఏరులై పారుతోంది. ఇప్పటికే తాగినోడికి తాగినంత మద్యం అందుబాటులో ఉంటోంది. దీంతో మందుబాబులు మంచి జోష్లో ఉంటున్నారు. కొత్త మద్యం బార్ల పాలసీతో సమయంతో పని లేకుండా ఇక నుంచి మద్యం విచ్చలవిడిగా దొరకనుంది. ఈ నేపథ్యంలో మందుబాబులకు ఇక కిక్కే కిక్కు అనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం రాబడి చూసుకుంటుందే తప్ప ప్రజారోగ్యాన్ని గాలికొదిలేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత వైసిపి ప్రభుత్వం మద్యపానం నిషేధమంటూ ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. బ్రాండ్లతో సంబంధం లేకుండా ధరలు విపరీతంగా పెంచి మద్యం అమ్మకాలు సాగించింది. కూటమి ఎన్నికల హామీలో భాగంగా నూతన మద్యం పాలసీ తీసుకొచ్చింది. దీనిలో భాగంగా జిల్లాలో 175 మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. వీటికి తోడు బడి, గుడి అనే తేడా లేకుండా బెల్ట్ షాపులు కూడా పుట్టగొడుగుల్లా వెలిశాయి. జిల్లాలో నాలుగు వేలకుపైగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని అంచనా. దీంతో అంతటా మద్యం ఏరులై పారుతోంది. సమయంతో సంబంధం లేకుండా 24 గంటలూ మద్యం దొరుకుతుంది. దీంతో మందుబాబులు ఫుల్లుగా తాగుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా విక్రయాలు సాగిస్తున్నారు. ఇదంతా ప్రజాప్రతినిధులు, అధికారులు, కనుసన్నల్లోనే జరుగుతుండటం గమనార్హం. జిల్లాలో మద్యం ఏరులై పారడానికి కారణమైన నూతన మద్యం పాలసీకి.. కొత్త బార్ల పాలసీ తోడవుతుండటంతో వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో 20, పశ్చిమగోదావరి జిల్లాలో 28 బార్ల ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం పట్టణంలో 7, నరసాపురంలో 3, పాలకొల్లులో 6, తణుకులో 6, ఆకివీడులో ఒక బార్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి బార్కు తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయిస్తారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. లాటరీలో ఎన్ని బార్లకైనా లైసెన్సులు పొందొచ్చు. ప్రతి దరఖాస్తుకూ రూ.5.10 లక్షల నాన్-రీఫండబుల్ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలి. 28వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కలెక్టరేట్లో లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయించనున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి జిల్లాలో నూతన మద్యం బార్లు ప్రారంభం కానున్నాయి.

28న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ

ఈ నెల 28వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీస్తారు. ఎంపికైన వారు అదే రోజు మొదటి విడత సొమ్ము కట్టి మరో విడత సొమ్ముకు సంబంధించి గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. లాటరీలో ఎంపికైన వారు ఒరిజినల్ లైసెన్స్ తీసుకుని 15 రోజుల్లో బార్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఏడాదికి రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ 50 వేల లోపు జనాభా గల బార్లకు రూ.35 లక్షలు, ఐదు లక్షల జనాభాలోపు రూ.55 లక్షలు, ఐదు లక్షల జనాభా దాటిన తర్వాత రూ.75 లక్షలుగా నిర్ణయించారు. ప్రతియేటా 10 శాతం ఫీజు పెరుగుతుంది. గీత కార్మిక సామాజిక తరగతులకు సంబంధించిన బార్లకు మాత్రం 50 శాతమే వసూలు చేస్తారు.

అర్ధరాత్రి వరకు అనుమతి

గత ప్రభుత్వ హయాంలో మద్యం బార్ల లైసెన్సు ఫీజులు భారీగా ఉండటంతోపాటు బార్ తెరిచి ఉంచే వేళలు కుదించారు. ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకే బార్లకు అనుమతి ఉండేది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం బార్లు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇచ్చింది. అంటే మద్యం దుకాణాలు మూసేసిన తర్వాత కూడా రెండు గంటలపాటు బార్లలో మద్యం అందుబాటులో ఉండనుంది. మొత్తంగా నూతన బార్ల పాలసీలో మందుబాబులకు అర్ధరాత్రి వరకు తాగించి ఆదాయం పెంచుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. మద్యం దుకాణాలను దక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించిన కూటమి నేతలు బార్లను సైతం తమ గుప్పెట్లో ఉంచుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఒకవేళ వేరే వాళ్లకు వచ్చినా తమను వాటాదారులుగా చేర్చుకోవాల్సిందేనని సంకేతాలు పంపిస్తున్నట్లు సమాచారం.

కల్లుగీత కార్మికులకు తీవ్ర అన్యాయం

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీలో కల్లుగీత కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగింది. అరకొరగా మద్యం షాపులను కేటాయించి మొండిచెయ్యి చూపించింది. ఇక బార్ల పాలసీలోనూ మళ్లీ అదే జరిగింది. ఏలూరు జిల్లాలో రెండు, పశ్చిమలో రెండు బార్లను మాత్రమే గీతకార్మిక సామాజిక తరగతులకు కేటాయించి చేతులు దులుపుకుంది. రెండు జిల్లాల్లో వేలాది మంది కార్మికులు గీత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో గీత కార్మికులకు అండగా ఉంటామని కూటమి నేతలు హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించింది. చివరకు మద్యం దుకాణాల కేటాయింపుల్లోనూ గీత కార్మికుల పట్ల వివక్ష చూపిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కోడేరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ట గోదావరి

వరద గోదావరి

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - ఆచంట

కనకాయలంక కాజ్వే వద్ద అధికారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ పవన్ కుమార్

వశిష్ట గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నది తీర ప్రాంతాల ప్రజల్లో కలవరం మొదలైంది. గత రెండు రోజులుగా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీవర్షాలతోపాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలు తోడై గోదావరి వరద క్రమక్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖాధికారులు అప్రమత్తమయ్యారు. మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరి వరద క్రమంగా పెరుగుతుండటంతో రైతులు, లంక గ్రామాల ప్రజల్లో ఆందోళన మొదలైంది. కాటన్ బ్యారేజీ నుంచి పెద్దఎత్తున వరద నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో వశిష్ట గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి మూడు అడుగుల మేర పెరిగింది. దీంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. వరద నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నెమ్మదిగా లంకల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతుంది. భీమలాపురం ఏటిగట్టున దిగువనున్న నివాస ప్రాంతాల వారిని ఏ క్షణంలోనైనా చుట్టుముట్టే ప్రమాదం ఉండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. లంక గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం లంక భూముల్లో తమలపాకు, పచ్చిమిర్చి అరటి, కొబ్బరి, ఆకుకూర పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయి. వరద ఉధృతి మరింత పెరుగుతుందనే వార్త అక్కడి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మండలంలోని కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం, అయోధ్యలంక, పుచ్చలంక, మర్రిమూల, రాయిలంక, పెదమల్లం లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సాగిస్తున్నారు. వరద ఉధృతి ఇదేవిధంగా కొనసాగితే రెండు, మూడు రోజుల్లో లంక గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కరుగోరుమిల్లి వద్ద పుష్కర ఘాట్ పూర్తిగా నీట మునిగింది. ఆచంట ఎఎస్ఐ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కర ఘాట్ల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. తహశీల్దార్ జి.కనకరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

యలమంచిలి: గోదావరి వరద బుధవారం మరింత పెరగడంతో లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, గంగడపాలెం, లక్ష్మీపాలెం, దొడ్డిపట్ల తదితర గ్రామాల ప్రజల్లో ఆందోళన మొదలైంది. ప్రధానంగా లోతట్టు ప్రాంతమైన కనకాయలంక కాజ్వే పూర్తిగా నీట మునగడంతో అక్కడి ప్రజలు అధికారులు ఏర్పాటు చేసిన పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వరద పరిస్థితిని తహశీల్దార్ (గ్రంధి పవన్కుమార్) పరిశీలించారు. స్థానిక అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. దీంతోపాటు పెదలంక, కనకాయలంక గ్రామాల్లో వైద్య సిబ్బందిచే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నిషేధం

ఊరేగింపులో డిజె సౌండ్ సిస్టమ్ వినియోగించరాదు

వినాయక నిమజ్జనంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పి అద్నాన్ నయీం అస్మీ

ప్రజాశక్తి - భీమవరం

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్తో తయారు చేసిన విగ్రహాలను నిషేధించాలని, ఉత్సవాలను పకడ్బందీగా అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం, సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వశిష్ట సమావేశ మందిరంలో వినాయక ఉత్సవాలు, నిమజ్జనం కార్యక్రమాల నిర్వహణపై ఎస్పి అద్నాన్ నయీం అస్మీ, జెసి టి.రాహుల్కుమార్రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో మనందరం బాధ్యతగా మట్టి వినాయకులను వినియోగించి పర్యావరణానికి మేలు చేకూర్చాలన్నారు. మట్టి వినాయకుల నిమజ్జనం వల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదన్నారు. నిమజ్జన సమయంలో గజ ఈతగాళ్లు తగినంతమంది ఉండేలా చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖాధికారికి సూచించారు. కోలాటం, భజన వంటి సంప్రదాయ కార్యక్రమాలను మాత్రమే పందిళ్ల వద్ద ఏర్పాటు చేయాలని, రికార్డింగ్ డాన్సులు, డిజెలు ఏర్పాటు చేయరాదన్నారు. నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఎటువంటి బాణాసంచా కాల్చరాదన్నారు. అన్ని పట్టణాలు, మండలాల్లోనూ పోలీస్, రెవెన్యూ, మండలాధికారులు, పంచాయితీరాజ్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో వినాయక విగ్రహ ఏర్పాట్లు, నిమజ్జన ఏర్పాట్లు సామరస్యంగా ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విగ్రహాల నిమజ్జన ఎట్టి పరిస్థితుల్లో సాగునీటి కాల్వలు, తాగునీటి చెరువులలో చేయరాదన్నారు. జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో ఫైర్, విద్యుత్, పోలీస్, మున్సిపల్ తదితర అధికారులు అనుమతులు త్వరితగతిన ఇచ్చేలా చూడాలన్నారు. ఎలాంటి గొడవలూ పడకుండా అందరూ ప్రశాంతంగా ఉత్సవాలు జరిగేలా సహకరించాలని, తాగి గొడవలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జనానికి నిర్దేశించిన ప్రదేశాలను మాత్రమే వినియోగించాలని, అక్కడ మాత్రమే పోలీస్ బందోబస్తు చేయడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్కుమార్రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డిఒలు కె.ప్రవీణ్కుమార్రెడ్డి, దాసి రాజు, ఖతీబ్ కౌసర్ భానో, డిఎస్పిలు ఆర్.జయసూర్య, డాక్టర్ శ్రీ వేద, డి.విశ్వనాథ్, డిపిఒ ఎన్.రామ్నాథ్రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, డిఎంహెచ్ఒ జి.గీతాబాయి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా కార్మిక శాఖాధికారి ఆకన లక్ష్మి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.రాంబాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ వెంకటేశ్వరరావు, దేవాదాయ, ఎక్సైజ్, తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆక్వా రైతుల సదస్సు

ప్రజాశక్తి - ఉండి

అమెరికా సుంకాల దెబ్బతో కుదేలైన ఆక్వా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఈ నెల 21వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఉండి మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు ఆక్వా రైతుల సంఘం జిల్లా నేతలు జీను ఆదినారాయణ, డొక్కు స్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన సీడ్, ఫీడ్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కనీస మద్దతు ధర ఇవ్వా లని డిమాండ్ చేస్తూ ఈ సదస్సు నిర్వహిస్తున్నామని, ఆక్వా రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మహిళలపై అఘాయిత్యాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఐద్వా జిల్లా మహాసభలో రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీదేవి

ప్రజాశక్తి - భీమవరం

పతాకావిష్కరణ చేస్తున్న ఐద్వా నేతలు

మహిళలపై అఘాయిత్యాల నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీదేవి డిమాండ్ చేశారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఐద్వా 15వ జిల్లా మహాసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలు నుంచి ప్రకాశం చౌక్, మావుళ్లమ్మ గుడి మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐద్వా జిల్లా కోశాధికారి ఎస్.జయప్రభ సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహాసభకు జిల్లా అధ్యక్షులు కేతా పద్మజ, నేతలు ఎస్.జయప్రభ, సరోజిని అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని నివారించాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. పాలకుల విధానాల వల్ల మహిళల స్థితిగతులు రోజురోజుకీ దిగజారిపోతున్నాయన్నారు. ప్రధానంగా మద్యం, మత్తు పదార్థాలను ప్రభుత్వం అరికట్టకుండా వాటిని ఆదాయ వనరులుగా పరిగణించడం బాధాకరమన్నారు. జిల్లా కార్యదర్శి పి.పూర్ణ మాట్లాడుతూ మహిళల సమస్యలపై సంఘటిత ఉద్యమాలు ఉధృతం చేయాలన్నారు. మైక్రో ఫైనాన్స్, డ్వాక్రా సమస్యలు, మద్య నిషేధం, చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్, నిత్యావసర సరుకుల అధిక ధరల తగ్గింపు తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని మహాసభ ఎన్నుకుంది.

త్వరలో బ్రిడ్జి పనులు ప్రారంభం

ఆర్డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని చిన మామిడిపల్లి రైల్వేగేట్ వద్ద పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రయాణించడానికి వీలుగా నిర్మించ తలపెట్టిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని ఆర్డిఒ దాసి రాజు చెప్పారు. బుధవారం బ్రిడ్జి నిర్మించనున్న ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆర్డిఒ పరిశీలించారు. గేట్ సమస్య పరిష్కారానికి మూడేళ్ల క్రితం బైపాస్ రోడ్డు నిర్మించడంతో గేటుకు అవతల, ఇవతల ప్రాంతాల వారు రాకపోకల విషయంలో దూరం పెరిగి ఇబ్బందులు పడుతున్నారని ఆర్డిఒ చెప్పారు. ఇరు ప్రాంతాల వారికి వెలుసుబాటుగా ఫుట్ పాత్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ అంగీకరించిందన్నారు. ఆయన వెంట రైల్వే అధికారులు మయాన్ ఉపాధ్యాయ, పిఎంకె శాస్త్రి, మధుబాబు, డ్రైనేజ్ డిఇఇ బి.మోహనకృష్ణ, ఆర్అండ్బి ఎఇ కె.ప్రసన్నబాబు, తహశీల్దార్ అయితం సత్యనారాయణ పాల్గొన్నారు.

అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

గత సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కువ సమయం ఓటింగ్ సాగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అవసరమైన చోట అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం కలెక్టర్ నాగరాణి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటర్ల జాబితా సవరణ, అదనపు పోలింగ్ స్టేషన్ల గుర్తింపు అంశాలపై చర్చించారు. పోలింగ్ ఎక్కువ సమయం పట్టడానికి గల కారణాలను విశ్లేషించడంతోపాటు, అవసరమైనచోట అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో తప్పొప్పులకు తావు లేకుండా ఎప్పటికప్పుడు ఫారం-6, 7, 8 క్లెయిమ్లను పరిష్కరించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, యువతకు ఓటుహక్కుపై అవగాహన కల్పించడంతోపాటు ఓటుహక్కు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, ఇన్ఛార్జి సూపరింటెండెంట్ మర్రాపు సన్యాసిరావు, టిడిపి నాయకులు మరపట్ల శ్యాంబాబు, బిజెపి నాయకులు కె.రవికుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, జెఎస్పి నాయకులు జైశివ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా



డిప్యూటీ తహశీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉండి: మండలంలోని విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కె.సూర్యనారాయణరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీ ఎక్కువగా ఉందన్నారు. ఇవన్నీ తెలిసి కూడా విద్యా శాఖాధికారులు ఏమాత్రం పట్టించుకోవట్లేదన్నారు. అర్తమూరులో వెంటనే నూతన పాఠశాల భవనం నిర్మించాలన్నారు. బాలుర వసతిగృహంలో తాగునీరు అందించాలని కోరారు. యండగండి ప్రభుత్వ కళాశాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటిని తక్షణమే వేరే చోట విడిచి పెట్టాలని, కుక్కల భయంతో చాలామంది కళాశాలకు రావట్లేదని అన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు అందరినీ సమీకరించి పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు కె.రోహిత్, కె.గోవింద్, నాయకులు సతీష్, పి.రమేష్, ఎం.సంతోష్, రోహిత్, ఎస్.మణిరత్నం పాల్గొన్నారు.

'దళితుల ఇళ్ల జోలికొస్తే సహించేది లేదు'

ప్రజాశక్తి - ఉండి

దళితవాడలోని తమ ఇళ్ల జోలికొస్తే సహించేది లేదని, అన్ని సంఘాలను ఏకం చేసి ఉద్యమిస్తామని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తే రాజకుమార్, దళిత సంఘం నాయకులు యాడంగి యేసు హెచ్చరించారు. బుధవారం వాండ్రం గ్రామంలో దళిత మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమార్, యేసు మాట్లాడుతూ కాల్వల ప్రక్షాళన పేరుతో రాజకీయ కక్షకు దిగిన కొందరు భూస్వాములు తమ నివాసాలను కూల్చేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. గ్రామంలో దళితవాడకు చేర్చి 1938 నుంచి ఇసుకకోడు అనే అనధికార కాలువ ఉందన్నారు. గ్రామానికి చెందిన రెండు మంచినీటి చెరువుల నుంచి కేవలం మురుగునీటిని బొండాడ డ్రెయిన్లోకి వదిలేందుకు ఈ కాలువను ఉపయోగించేవారని వివరించారు. అయితే పెదఅమిరం గ్రామ భూస్వాములకు చెందిన 45 ఎకరాల ఆక్వా చెరువు కోసం ఈ కాల్వను ప్రక్షాళన చేసేందుకు కొందరు భూస్వాములు తమపై కుట్ర పన్నుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల సుమారు 200 సంవత్సరాలుగా నివసిస్తున్న 30 నిరుపేద కుటుంబాలు తమ గూడును కోల్పోయే ప్రమాదం ఉందని వారు వాపోయారు. దీనిపై సమగ్ర సర్వే జరిపి గ్రామ సభ నిర్వహించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్కు మంగళవారం వినతిపత్రం అందించామన్నారు. ఇంతలో తమ ఇళ్లను కూల్చేందుకు పొక్లెయిన్ తీసుకురావడం దారుణమన్నారు. ఇప్పటికైనా గ్రామంలో శాంతియుత వాతావరణంలో గ్రామసభ నిర్వహించాలని, ప్రజాభీష్టం మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజును కలిసి తమ గోడు చెప్పుకుంటామని, న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. లేనిపక్షంలో న్యాయపోరాటం చేపడతామన్నారు. కార్యక్రమంలో కోనాల రాజేంద్ర, కోనాల జీవన్ కుమార్, మంద శ్రీనివాసరావు, సంజీవరావు, కోనాల సుదర్శనరావు, గోరింకల ఆశీర్వాదం, కోనాల ఆనంద్బాబు, బాధితులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు జీవితం యువతకు ఆదర్శనీయం

ఐఎఎస్గా ఉద్యోగోన్నతి పొందిన డిఆర్ఒకు కెవిపిఎస్ అభినందనలు

ప్రజాశక్తి - భీమవరం



డిఆర్ఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

అట్టడుగుస్థాయి నుంచి అత్యున్నత స్థాయికి చేరిన ఐఎఎస్ మొగిలి వెంకటేశ్వర్లు జీవిత ప్రయాణం యువతకు ఆదర్శనీయమని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కన్ఫర్డ్ ఐఎఎస్ల్లో ఉద్యోగోన్నతి పొందిన డిఆర్ఒ వెంకటేశ్వర్లును స్థానిక కలెక్టరేట్లో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు, జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, కొమరం భీమ్ జీవిత చరిత్ర పుస్తకాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కన్ఫర్డ్ ఐఎఎస్-2023 సెలెక్షన్ లిస్టులో మొగిలి వెంకటేశ్వర్లు నియామకం సంతోషమన్నారు. వ్యవసాయ శాఖలో 1996లో సబార్డినేట్గా ఉద్యోగంలో చేరి అనేక డిపార్టుమెంట్లో వివిధ హోదాల్లో అధికారిగా చేసి అంచలంచెలుగా ఎదిగి నేడు ఐఎఎస్ కావడం గర్వకారణమన్నారు. 30 ఏళ్ల సర్వీసులో ప్రజలందరూ హర్షించేలా మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ప్రజా సమస్య పరిష్కారానికి ఆయన కృషి ఎనలేనిదన్నారు. ఐఎఎస్గా అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిఎం ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ప్రజా రవాణా సేవలు, కార్గో సేవలు, కార్గో డెలివరీ, విద్యార్థులకు రాయితీలు, బస్సులకు సంబంధించిన ఇబ్బందులు, విహారయాత్రలకు ప్రత్యేక బస్సులు, సలహాలు, సూచనలు, సిబ్బంది ప్రవర్తన, ప్రత్యేక బస్సుల ఫిర్యాదులుంటే 9959225486 నెంబర్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

ప్రజాశక్తి - ఉండి

అతి చిన్న వయసులోనే ప్రధానిగా బాధ్యతలు చేపట్టి భారతదేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిన రాజీవ్ గాంధీ ఎందరికో ఆదర్శప్రాయుడని మాజీ ఎంపీ, టిటిడి మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు కొనియాడారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఉండి మెయిన్ సెంటర్లోని కాంగ్రెస్ స్థూపం వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బాపిరాజు పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల వయసులోనే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ అతి చిన్న వయసులోనే అధ్యక్షులైన వారిలో ఒకరన్నారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఆయనతోపాటు జంపన సూర్యనారాయణ రాజు, మోపిదేవి కేదారేశ్వర రావు, బుద్ధిరాజు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్

ప్రజాశక్తి - నరసాపురం

చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు పురస్కరించుకుని అభిమానులు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ అన్నారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం 6వ రోజు మండలంలోని చిట్టవరం గ్రామంలో సగరపేట చిరు, పవన్, చరణ్ యూత్ ఇబ్బా మోహన్, జుట్టూ శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నరసాపురం సాయి అప్పన డెంటల్ హోం వారిచే ఉచిత దంత పరీక్షల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నడిపూడి పెద్దిరాజు, కొప్పెడి వెంకట్, పెరుమాళ్ల స్వామి, ఇబ్బ ఆదినారాయణ, అభిమానులు కోపల్లి శ్రీనివాస్, పోలిశెట్టి సత్తిబాబు, చెన్నంశెట్టి నాగు, జుట్టూ రామకృష్ణ, కొప్పిరెడ్డి హరిబాబు, గంధి శ్రీను, పైడికొండల కృష్ణ పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు కాలేజ్ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి బుధవారం చెప్పారు. తమ కాలేజీలో బిఎమ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సి కెమిస్ట్రీ, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఉన్నట్లు చెప్పారు. కళాశాలలో ఆధునిక వసతులతోపాటు అనుభవం కలిగిన అధ్యాపకులను నియమించినట్లు చెప్పారు. నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. సీట్లు పరిమితంగా ఉన్నాయని, విద్యార్థులు త్వరితగతిన కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు 7901056668 నెంబర్ కి సంప్రదించాలని కోరారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆచంట

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపిడిఒ బివిఎస్.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బంది క్షేత్ర సహాయకులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, మస్టర్లు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎపిఒ టి.సత్యనారాయణ, సిఒ రాజేష్ పాల్గొన్నారు.

మదనగోపాల స్వామి ట్రస్ట్ బోర్డు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయాల పరిరక్షణకు నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ తనయుడు, యువ నాయకులు పితాని వెంకట్ అన్నారు. బుధవారం మండలంలోని మల్లిపూడిలో శ్రీమదన గోపాల స్వామి ట్రస్ట్ బోర్డు నూతన పాలకవర్గ అధ్యక్షులు దండు నాగరాజు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసి దండు లక్ష్మి, గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, గుడిమెట్ల సుందర రామిరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గణపతి మండపాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

ఉండి: గణపతి మండపాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా అన్నారు. బుధవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో గణపతి మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల తహశీల్దార్ కవిటి నాగరత్నం, ఎంపిడిఒ శ్రీనివాస్, ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా, ఆకివీడు ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ సూర్య బ్రహ్మం మాట్లాడుతూ గణపతి మండపాలు ఏర్పాటు చేయడానికి ఆన్‌లైన్ అప్లికేషన్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మండపాల వద్ద భారీ బాణాసంచా కాల్చులు, డిజె సౌండ్‌లు ఏర్పాటు చేయకూడదని తెలిపారు. మండపం వద్ద కచ్చితంగా వాలంటీర్లు ఉండాలని, మండపం వద్ద ఇసుక బకెట్లు ఉంచాలని, ఫైర్ సేఫ్టీ కిట్ ఉంచాలని, మండపం వద్ద ఎటువంటి గొడవలు లేకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని అన్నారు. ఎవరైనా మద్యం తాగి గొడవలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు హెచ్చరించారు.

మమ్మల్ని అవమానిస్తున్నారు

గౌడ శెట్టిబలిజ నాయకులు

భీమవరం టౌన్ : భీమవరం నియోజవర్గంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ తోట సీతారామలక్ష్మి గౌడ శెట్టిబలిజ కులస్తులను అవమానపరుస్తున్నారని గౌడ శెట్టిబలిజ నాయకులు ఆరోపించారు. బుధవారం భీమవరంలోని స్థానిక సర్దార్ తాలు చప్పన్న కమ్యూనిటీ హాల్లో జరిగిన గౌడ శెట్టిబలిజ నాయకుల సమావేశంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజవర్గంలో జరిగిన నీటి సంఘం, కోఆపరేటివ్ సహకార బ్యాంకులు, దేవాలయాల్లోని, మార్కెట్ యార్డ్ కమిటీలలో సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. టిడిపి అంటే బిసిల పార్టీ అని, కార్యకర్త నాయకుడని తమ అధినాయకులు చంద్రబాబు, లోకేష్ చెబుతున్నారని, అయితే భీమవరంలో ఆయన భిన్నంగా జరుగుతున్నారన్నారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గౌడ శెట్టిబలిజ రాష్ట్ర నాయకులు వీరపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర శెట్టిబలిజ సాధికార కమిటీ డైరెక్టర్ బొక్క సూరిబాబు, నరసాపురం పార్లమెంట్ గౌడ సాధికార కన్వీనర్ వీరమల్లు నారాయణ పాల్గొన్నారు.

డాక్టర్ రామకృష్ణ సేవలు అభినందనీయం

తణుకు : హెచ్‌ఐవి రోగులకు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ అందించిన సేవలు అభినందనీయమని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్, ఆర్ఎంఒ డాక్టర్ ఎవిఆర్ఎస్.తాతారావు కొనియాడారు. బుధవారం తణుకు ఎఆర్‌టి సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా సేవలందజేసి పదవీవిరమణ పొందిన సందర్భంగా డాక్టర్ సుంకవల్లి రామకృష్ణను ఘనంగా సత్కరించారు. ఎఆర్‌టి సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.సత్తిరెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ఉషారాణి, డాక్టర్ జి.హిమవంతయ్య పాల్గొన్నారు.

పింఛన్లు పునరుద్ధరించాలని వినతి

నరసాపురం: తమకు అందుతున్న పింఛన్లను వాస్తవమైన కారణాలు చూపకుండా ప్రభుత్వం నిలిపివేసిందని, వాటిని పునరుద్ధరించాలని కోరుతూ యర్రంశెట్టిపాలెంకు చెందిన వికలాంగులు బుధవారం ఎంపిడిఒ వి.వి.వీరభద్రరావుకు వినతి పత్రం అందజేశారు. 13 మంది వికలాంగులకు పింఛన్లు తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమ్మ, ఎంపిపి మాజీ వైస్ ఛైర్మన్ యర్రంశెట్టి బాబులు, గ్రామ ఉప సర్పంచ్ తెంగంశెట్టి శ్రీదేవి వాపులను కోరారు.

మద్యం వల్ల కలిగే నష్టాలపై అవగాహన

తాడేపల్లిగూడెం : మద్యం వ్యసనం ఒక వ్యాధి వంటిదని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ సైకాలజిస్ట్ గంగార్ రెడ్డి తెలిపారు. విక్టర్ కాలనీలోని కళ్యాణమండపంలో ద్వారా మహిళలకు బుధవారం మద్యం సేవించడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

దోమలు నివారిస్తే రోగాలు దరిచేరవు

ప్రజాశక్తి - గణపవరం

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం గణపవరం పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కె.ఓంకార్ నాద్ మాట్లాడుతూ దోమలు నివారిస్తే రోగాలు దరిచేరవని అన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి రోగాలు వస్తాయని చెప్పారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన మంచినీళ్లు తాగాలని తెలిపారు. ఇళ్లల్లో దోమతెరలు ఏర్పాటు చేసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, వైద్యసిబ్బంది బాలమురళీ కృష్ణ, పద్మజ పాల్గొన్నారు.

ఉండి: దోమ కాటు వల్ల పలు ప్రాణాంతకమైన వ్యాధులు సంభవిస్తాయని యండగండి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బెన్నీ శామ్యూల్ అన్నారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా పాందువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1897 ఆగస్టు 20వ తేదీన సర్ రోనాల్డ్ రాస్ ఆడ ఎనాఫిలిన్ అనే దోమ వల్ల మలేరియా వ్యాధి సంక్రమిస్తుందని కనుగొనడంతో ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. దోమ తెరలు వాడడం, మురుగు కాలువల వద్ద క్రిమి సంహారక మందులు పిచికారీ చేయడం, నీటి నిల్వ లేకుండా చూసుకోవడం వంటి కనీస జాగ్రత్తల వల్ల దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల గైడ్ టీచర్ కె.పార్వతి, యండగండి పిహెచ్‌సి సిహెచ్‌ఒ జి.వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం : ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా వీరవాసరం పిహెచ్‌సిలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమలు ఎలా వృద్ధి చెందుతాయి, వాటిని నివారించుకునే మార్గాలపై అవగాహన కలిగించారు. ప్రతి మంగళవారం వెక్టార్ హైజిన్ యాప్ ద్వారా గ్రామాలలో లోతట్టు ప్రాంతాలను గుర్తించడం, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించడం, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వై.నాగబాబు, భీమవరం సబ్ యూనిట్ అధికారి సిహెచ్‌ఒ కె.ప్రసాద్, ఎఎస్ఎస్ఎన్.మూర్తి ఉన్నారు.

పాలకొల్లు : దోమల వల్ల అనేక వ్యాధులు వస్తాయని, అందుకే ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని పాలకొల్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి కోరారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన పాలకొల్లు లాకుపేట ఏరియాలో మీటింగ్ నిర్వహించి దోమలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైలేరియా సూపర్‌వైజర్ వై.బాలచంద్రుడు, హెల్త్ అసిస్టెంట్ సత్తిరాజు, శివనాగరాజు పాల్గొన్నారు.

పలుచోట్ల ప్రపంచ దోమల దినోత్సవం

గణపవరంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పాందువ్వలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పోరాటానికి సిద్ధం కావాలి

అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి పిలుపు

ఆకివీడు : కోర్కెల సాధన కోసం ప్రతి ఒక్కరూ మరోసారి పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని అంగన్వాడీ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సాయంకాలం అంగన్వాడీల ప్రాజెక్ట్ స్థాయి సమావేశం నిర్వహించారు. స్థానిక సంఘ అధ్యక్షురాలు డి.మార్తమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళ్యాణి పాల్గొని మాట్లాడారు. అనంతరం మహాసభలో సభ్యులు కొత్త ఫోన్లు ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా టి.మార్తమ్మ, ఉపాధ్యక్షులుగా కృష్ణవేణి, విమల కార్యదర్శిగా ఎస్.పైడేశ్వరి, సహాయ కార్యదర్శిగా డి.ఇరానీ, కుసుమ, కోశాధికారిగా రమాకుమారి, శ్యామలతోపాటు మరో 21 మంది కార్యవర్గ సభ్యులతో ప్రాజెక్ట్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వృత్తి విద్య శిక్షణార్థులకు అభినందనల పురస్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యా విభాగం తరఫున జిల్లాలో ఉన్న 8 రకాల వృత్తి నైపుణ్య విద్యా కోర్సులకు సంబంధించిన ప్రదర్శనలు జరిగాయి. దీనిలో భాగంగా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా(బిఎఫ్ఎస్ఐ), సమాచార సాంకేతికం (ఐటీ/ఐటీస్) విభాగాల తరఫున ప్రదర్శనలు ఇవ్వడానికి జిల్లా పరిషత్ హైస్కూల్ గూట్లపాడు నుండి కె.కుమార్(బిఎఫ్ఎస్ఐ), వి.మౌనిక(ఐటి) ఆ విభాగాల విద్యార్థులతో ఎంపికయ్యారు. మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా విద్యాధికారి, జిల్లా వైద్యాధికారి, ఇతర ప్రముఖులు సందర్శించి, వీరికి ఉత్తమ ప్రదర్శనలకు గాను అభినందనలు తెలియజేశారు. దీనిలో భాగంగా గూట్లపాడు హైస్కూల్‌లో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సత్యవాణి, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, వృత్తి విద్యా శిక్షణార్థులకు, విద్యార్థులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి అండ ఉంటుందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరు శేరేపాలెం, కొత్తట, కాళీపట్నం పడమర, జగన్నాధపురం, పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్ తదితర గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల అనారోగ్యానికి గురై సొంత నిధులతో వైద్యం చేయించుకున్న వారికి బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన వెంట మొగల్తూరు సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారక రామారావు, ఉప సర్పంచి బోనం నరసింహారావు, దూసనపూడి దొరబాబు, దాసరి కృష్ణాజీ, ముక్కు గిరి, పుల్లయ్య నాయుడు, బొక్క చంటి, దేశం శెట్టి శ్రీను ఉన్నారు.

వలస పిల్లలకు పాఠశాల ప్రవేశం

పెనుమంట్ర : మండలంలోని మాముడూరు గొస్తనీ నది పక్కన రొయ్యల పరిశ్రమలో పని కోసం పశ్చిమ బెంగాల్ నుండి వలస వచ్చిన కుటుంబాలలోని బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని బుధవారం స్థానిక మాముడూరు ఎంపిపి మోడల్ స్కూల్‌లో చేర్చారు. చాలా కాలంగా అవగాహన లేక, బడి ముఖం చూడకుండా వీధుల్లో ఆడుకుంటున్న వెస్ట్ బెంగాల్ కార్మికుల పిల్లలను స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు గుర్తించారు. ఈమేరకు ఎంఇఒ యు.నాగేశ్వరరావు ప్రోత్సాహంతో పిల్లల తల్లిదండ్రులకు విద్య అవసరం వివరించి పాఠశాల హెచ్ఎం డి.నరసింహారావు, డిఎన్‌వి. సత్యనారాయణ పాఠశాలలో ప్రవేశం కల్పించారు.

తాండవేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

ఉండి : మండలంలోని ఆరేడు గ్రామంలో వేంచేసి ఉన్న తాండవేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం ఆలయ ఇఒ ఎం.రాధ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి బ్రహ్మానందం, ఎంపిటిసి రుద్రరాజు సూర్యనారాయణ రాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, మండల అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఈ ఆలయానికి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గొట్టం రామకృష్ణ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. నూతన ఛైర్మన్‌గా గొట్టం రామకృష్ణ, సభ్యులుగా పిప్పిరిశెట్టి సుబ్బారావు, చల్లా సంధ్య గాయత్రి, నక్కా దుర్గారావు, బండి ఆదిలక్ష్మి, కోడే వరలక్ష్మి, ఎంఎన్‌విఎస్.దుర్గాప్రసాద్, గొన్నబత్తుల వెంకటరమణ, పాలకోడేరు నాగలక్ష్మి, కొండవీటి కాశీ విశ్వనాథ శాస్త్రిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గొట్టం రామకృష్ణ మాట్లాడుతూ తనను నమ్మి ఆలయ నిర్వహణ బాధ్యతలు అప్పగించిన స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలిగొట్ల సర్పంచి ఎంఎస్, ఉప్పులూరు సర్పంచి దుర్గారావు, ఆరేడు గ్రామ అధ్యక్షులు పిప్పిరిశెట్టి పోలేశ్వరరావు, స్థానిక నాయకులు గొట్టం బాబి, యశోద కృష్ణ, పొత్తూరి ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

మాజీ హోం మంత్రి మావయ్య బాబురావు మృతి

పాలకొల్లు : రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత మామయ్య తానేటి బాబురావు(80) బుధవారం ఉదయం పాలకొల్లులో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వనిత బాబురావుకు పెద్ద కోడలు. వనిత భర్త వైద్యునిగా పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం బాబురావు అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతికకాయానికి డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, వైసిపి అంగన్వాడీ సెల్ ఉపాధ్యక్షులు మద్దా చంద్రకళ, పట్టణ అధ్యక్షులు కోరాడ శ్రీనివాస్ నివాళి అర్పించారు.

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - పెంటపాడు

మాట్లాడుతున్న బాబూరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై అనేక పెనుభారాలు మోపుతూ, కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను తీసుకొచ్చారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, సిరపరపు రంగారావు అన్నారు. సిఐటియు మండల నాలుగవ మహాసభ పెంటపాడు కార్యాలయం ఎదుట పైపుల ఫ్యాక్టరీలో బుధవారం నిర్వహించారు. ఈ మహాసభను ఉద్దేశించి చింతకాయల బాబూరావు, సిరపరపు రంగారావు, రైతు సంఘం నాయకులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు మండల నాయకులు బంకూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పిఎఫ్‌లో, గ్రాడ్యుటీలో, ట్రేడ్ యూనియన్ చట్టాల్లో, సమ్మె హక్కుల్లో మార్పులు, రాష్ట్ర వ్యాప్త రంగాలలో కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని, అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు మార్పు చేసి కొత్త ఫోన్లు ఇవ్వాలన్నారు. మిడ్ డే మీల్స్ కార్మికులకు గౌరవ వేతనం కాకుండా కనీస వేతనాలు అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు తక్షణమే పునరుద్ధరించాలని వారు కోరారు. అనంతరం 16 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ కమిటీలో కన్వీనర్‌గా దూరం ప్రసాద్, కో కన్వీనర్‌గా జె.శ్యామల కుమారి, కమిటీ సభ్యులు చిర్ల పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వరరావు, వడ్డాది సన్యాసిరావు, జామకాయల శ్రీను, కొంపల్లి శ్రీను, ఆకుల గంగరాజు, మొగమట్ల బుల్లి రాజు, వర్రీ వీర రాఘవమ్మ, కుంద్రపు అనురాధ, యడ్లపల్లి జయంతి, కసిరెడ్డి అచ్చి అమ్మా, మానుకొండ జ్యోతి, ప్రత్తిగొల్ల గౌరీ ధనరాజ్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా నాయకులు

ప్రజాశక్తి - పెంటపాడు

అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మండలంలోని యానాలపల్లి గ్రామంలో ముంపుకు గురైన వరి పొలాలను రైతు సంఘం ఆధ్వర్యాన పరిశీలించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడుతూ ముంపు బారిన పడిన రైతాంగం వారి మనోవేదన వ్యక్తపరిచారన్నారు. ఈ సంవత్సరం సార్వా సీజన్ నుండి అనేక ఇబ్బందులు పడ్డామని, ఇప్పటివరకు సుమారుగా రూ.20 వేలు వ్యవసాయానికి ఖర్చు పెట్టామని, మురుగు కాలువల ఆధునీకరణ చేయక పొలాలు ముంపుకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతును ప్రభుత్వమే రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మరపట్ల దానయ్య, తాడి సుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు గాది వెంకట్రావు, గిద్ద భద్రరావు, సాధనాల ప్రసాద్, మాదాసు శీను, తాడి అంజి, కవల సుబ్బారావు పాల్గొన్నారు.

నీటమునిగిన పంట పొలాల పరిశీలన

పెనుమంట్ర : మండలంలోని సోమరాజు ఇల్లింద్రపర్రు, మల్లిపూడి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఉండి శాస్త్రవేత్తలు, మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలతో స్థానిక మండల వ్యవసాయ అధికారిణి బి.దేవి స్వరూప ఆధ్వర్యాన బుధవారం మధ్యాహ్నం సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎంటియు 1318 రకాన్ని రైతులు సాగు చేశారని, ముంపుకు గురైనటువంటి వరి పొలాలలో నీరు మురుగు కాలువల ద్వారా బయటకు పంపాలని అన్నారు. మురుగునీరు పూర్తిగా బయటికి వెళ్లిన వెంటనే బూస్టర్ డోస్‌గా ఎకరానికి 20 కేజీలు యూరియాని, 10 కేజీలు పొటాష్ ఎరువులు వేయాలని తెలిపారు. అలాగే సస్యరక్షణ చర్యల్లో భాగంగా ఎక్సాకోనజోల్ 2 ఎంఎల్ ఒక లీటర్ నీటికి లేదా ప్రొఫి కొనజోల్ 1 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి ఏదో ఒక దానిని పైపాటిగా పిచికారీ చేయాలని కోరారు. పైరు ఎదుగుదలను బట్టి వారం రోజుల తర్వాత జింకు సల్ఫేట్‌ను 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బృంద సభ్యులు ఎ.ఆనందకుమార్, ఎన్.శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది ఎఇఒ.సత్యనారాయణ, విఎఎలు లహరి, కార్తీక్, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : పొలాలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఉండి : ముంపుకు గురైన పంట పొలాలను బుధవారం మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యాన కెవికె శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంట పొలంలో వర్షపు నీరు తగ్గిందని, వరిచేలు పిలక తొడిగే దశలో ముంపుకు గురైందన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ పి. వినయలక్ష్మి, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఆకివీడు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ప్రతాప్ జీవన్ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యాన శాంతి ర్యాలీ

పెనుగొండలో మానవత శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - ఉండి

ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం గడపడంతోనే ఆయురారోగ్యాలు లభిస్తాయని ఉండి మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. బుధవారం ఉండిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ని శ్రీహరి నారాయణరాజు ప్రారంభించి మాట్లాడారు. ఎంపిడిఒ శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతియుత సమాజంతోనే ప్రపంచ శాంతి ఉంటుందని అన్నారు. ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతిని కాంక్షించాలని తెలిపారు. మానవత సంస్థ అధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, ఛైర్మన్ రుద్రరాజు యువరాజు మాట్లాడుతూ మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రపంచశాంతిని కాంక్షిస్తూ ప్రతీ ఏటా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కో ఛైర్మెన్ దంగేటి రామలింగేశ్వరరావు, కన్వీనర్ కొమ్మన నాగబాబు మాట్లాడారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యాన దివ్య కాలేజీ విద్యార్థులు కొండ్రోతు పేట, బాలాజీ రావు పేట మీదుగా ఉండి పురవీధుల్లో ర్యాలీ జరిగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ నాయకులు పరంశెట్టి ఆంజనేయులు, చింతాడ మహేష్, గాదిరాజు సూర్యకుమారి, రుద్రరాజు శివవర్మ, పెన్మెత్స రంగప్రసాదరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుగొండ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యాన మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు, మానవత సంస్థ సభ్యుల ఆధ్వర్యాన శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెయిన్ రోడ్డు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షులు కొమ్ముల రామకృష్ణ, జిల్లా సభ్యులు కర్రి నరేంద్ర రెడ్డి, దొరబాబు, షేక్ మస్తాన్, బచ్చు నరసింహ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రపంచ శాంతిని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించాలని తాడేపల్లిగూడెం పట్టణ ఎస్ఐ బాదం శ్రీనివాస్ సూచించారు. మానవత ఆధ్వర్యాన ప్రపంచ శాంతిని కోరుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మానవత సేవలు అభినందనీయమన్నారు. సంస్థ పట్టణ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, పైడికొండల సింధు ఉన్నారు.

సిపిఎస్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరుతూ బుధవారం డిఎస్‌సి 2003 టీచర్స్ ఫోరం అభ్యర్థులు స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెమో 57 ప్రకారం డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సిపిఎస్ రద్దుచేసి, ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, దేశంలోని 16 రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేశాయన్నారు. ఈనెల 25న విజయవాడలోని అలంకార్ సెంటర్లోని ధర్నాచౌక్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌సి 2003 టీచర్స్ ఫోరం, ఆంధ్రప్రదేశ్ నాయకులు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

బార్ నోటిఫికేషన్ విడుదల

పాలకొల్లు : సెప్టెంబర్ 1వ తేదీ నుండి ప్రారంభమయ్యే నూతన బార్ పాలసీ 3 సంవత్సరాలు(2025-2028)కి సంబంధించి పాలకొల్లు పట్టణానికి గీత కులాల రిజర్వ్ కేటగిరీ(గౌడ) బార్‌కి నోటిఫికేషన్ బుధవారం వెలువడినట్లు సిఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అని, ఒక్కొక్క అప్లికేషన్‌కు రూ.5 లక్షలు దరఖాస్తు రుసుము, రూ.10 వేలు అప్లికేషన్ ప్రాసెసింగ్ రుసుముగా నిర్ణయించడమైందని తెలిపారు. డ్రా లో బార్ దక్కించుకున్న వారికి గీత కులాల రిజర్వు కేటగిరీ బార్‌కి సగం లైసెన్సు ఫీజు రాయితీ ఇచ్చి రూ.27 లక్షల 50 వేలు సంవత్సర రుసుముగా ప్రభుత్వం నిర్ణయించిందని సిఐ తెలిపారు. ఈ పాలసీలో బార్ ఉదయం 10 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు టైమింగ్ నిర్ణయించబడిందని, బార్ లైసెన్సు ఫీజు 6 వాయిదాలలో చెల్లించ వచ్చునని తెలిపారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) : AT BHIMADOLE

E.P.8/2021 in O.S.67/2017

Between:
మండ ప్రసాదు ...DHR/Plaintiff
Vs
పూజారి ప్రసాదు ...JDr/Defendant
To.
పూజారి ప్రసాదు, S/o.శ్రీనివాస్,
R/o.గాలాయిగూడెం, దెందులూరు మండలం.

పై గ్రంథంలో DHR మీపై అరెస్టునకు EP దాఖలు చేసినందున శ్రీకోర్టు వారు Order 21 Rule 22 నోటీసులు జారీ చేసిఉన్నారు. కావున JDR పూజారి ప్రసాదు అను వారు పైకోర్టులో ది.28-8-2025వ తారీఖున ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కాని, ప్లీడరు గారి ద్వారా కాని హాజరై తమ ఆక్షేపణలు తెలియపరచుకొనవచ్చును. లేని యెడల సదరు పిటిషన్ తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

డి.సత్యన్నారాయణ
భీమడోలు ఎస్.గోపాలకృష్ణ
తేది.16-08-2025 అడ్వకేట్స్, భీమడోలు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS /ARBITRATION KARIMNAGAR
A R B NO. 498 of 2024.

Between:
KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED.,
Represented by its Divisional Legal Officer, KARIMNAGAR, Branch, V Ramesh S/o Kanakaiah Aged about 33 Years, R/o. Karimangar.
...Disputant
VERSUS
Theeda Sai Lokesh & Others
1. Theeda Sai Lokesh S/o. Srihari Apparao Age: 30years, Occ: Points Man-A, South Central Railway Department, Ramagundam, R/o. Q.No.68/1 Akbar Nagar, Railway Quarters, Ramagundam, Godavarikhani.
2. Ellandula Venkatesh S/o. Komuraiah Age: 31years, Occ: Points Man-A, Sourth Central Railway Department, Ramagundam, R/o. H.No. 1-131, Railway Colony, Sirpur, Adilabad.
5. Renikuntla Harish S/o. Vijayagiri Age: 33years, Occ: Asst. (Ele/TRO) South Central Railway Department, Ramagundam, R/o. H.no. 4-86, Ashok Nagar, Kundanpalli, Ramagundam, Godavarikhani.
7. Chintha Srinivas S/o. Anjaiah Age: 42years, Occ: Points Man (OPT), South Central Railway Department, Ramagundam, R/o. H.no. 13-787, Sanjeevaiah Colony, Madhari Wada, Bypass Road, Mancherial.
8. Prattipati kamala priya w/o. Sai lokesh age: 28years, occ: counsellor and accountant global sparks e/M school, r/o. H.No. 3-68/1, bedta veedhi, polavaram, west godavari.
... Opponents

Take notice that the above dispute is filed against you and others for recovery of money Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 28-08-2025 for your appearance On that day you have to appear in person at 11.00 A.M . Before the Deputy Register referred above. Other wise the case will be decided ex-party.

DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION KARIMNAGAR

స్థిరాస్థి వేలం ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు
ఇ.పి.నెం.78/2016 ఇన్
ఎఎ/సిఎఫ్/నెం.139 ఆఫ్ 2015

బిట్వీన్ :
మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, భీమవరం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచి మేనేజర్ ...డిక్రీ హోల్డర్
And
ఆచంట నాగ సత్యశ్రీనివాస ప్రభాకర్ & 6 Others ...జడ్జిమెంట్ డెబిటార్స్

1వ జెడిఆర్ : ఆచంట నాగ సత్య శ్రీనివాస ప్రభాకర్, తండ్రి నర్సింహారావు, డో.నెం.17-1-245, అయ్యగారి వారి వీధి, రుస్తుంబాద, నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరులో డిక్రీ వసూలు నిమిత్తం 1వ జెడిఆర్ తాలూకు ఈ క్రింది తెలిపిన ఇపి షెడ్యూలు దాఖలా స్థిరాస్థులను (1.2 అయిటమ్స్) **ది.04-09-2025**వ తేదీన పైకోర్టు వారి ఎదుట ఉదయం గం.10.30 ని॥లకు బహిరంగ వేలం జరుగునని తెలియపరచటమైనది. కావున వేలం పాటలో పాల్గొనువారు వేలం పాటలో పాల్గొనవచ్చును.

1వ జెడిఆర్‌కు చెందిన ప్రోపర్టీ షెడ్యూల్స్ వివరములు ఐటమ్ నెం.1 : పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం.124/2008 నర్సాపురం సబ్‌డివిజన్ మున్సిపల్ ఏరియా ఖాళీ స్థలం పాత 23వ వార్డు క్రొత్త 25వ వార్డు, రుస్తుంబాద రెవెన్యూ విలేజ్ దగ్గరలో పాత డో.నెం.16-3-27, క్రొత్త డో.నెం.16-3-69, సర్వే నెంబరు 617/2ఎలో గల చ॥గ॥316-3కు ఈ క్రింది సరిహద్దులు: **తూర్పు:** అ॥48.5 (6 అ॥లు) వై.వి.లక్ష్మణరావు, ఉమ్మడి మార్గం. **దక్షిణం:** అ॥58.5 ఎల్లా వెంకట లక్ష్మణరావు గారి స్థలం వగైరాలు. **పడమర:** అ॥48.0 ఎల్లా వెంకట లక్ష్మణరావు గారి స్థలం వగైరాలు. **ఉత్తరం:** అ॥ 59.5 (13 అ॥లు) వెడల్పు ప్రధాన వీధి.
డిక్రీ హోల్డర్ విలువ : రూ.10,00,000/-
మార్కెట్ విలువ : రూ.15,80,000/-

ఐటమ్ నెం.2 : పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం.585/2010, నర్సాపురం సబ్‌డివిజన్ మున్సిపల్ ఏరియా అయ్యగారి వీధి 27వ వార్డు, రుస్తుంబాద రెవెన్యూ విలేజ్ ఆర్.సి.సి బిల్డింగ్, డో.నెం. 17-1-245/3, సర్వేనెం.564/18లో గల చ॥గ॥159.8కు ఈ క్రింది సరిహద్దులు : **తూర్పు:** అ॥26.00 మున్సిపల్ రోడ్, **దక్షిణం:** అ॥49.00 దాసరి వెంకట లక్ష్మి గారి స్థలం వగైరాలు. **పడమర:** అ॥26.00 ఉమ్మడి మార్గం ఆకుల శేషయ్య ఇతరులు. **ఉత్తరం:** అ॥61.8 కోడూరి సుబ్బారావు గారి స్థలం.
డిక్రీ హోల్డర్ విలువ : రూ.25,00,000/-
మార్కెట్ విలువ : రూ.7,99,000/-

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
నర్సాపురం ఎం.సత్యకృష్ణ
తేది.20-08-2025 అడ్వకేట్,నర్సాపురం.